క్లుప్తంగా

యాదవ సంఘం నగర అధ్యక్షుడిగా అజయ్ కుమార్



అజయ్ కుమార్‌ను అభినందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : యాదవ సంఘం ఏలూరు నగర అధ్యక్షుడిగా బొట్టా అజయ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఏటిగట్టు ప్రాంతంలోని జిల్లా సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు చిదరబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఏలూరు నగర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జంకల సతీష్ శివ కుమార్, కోశాధికారిగా బోగా రాజేష్‌లను ఎన్నుకున్నారు. నగర కమిటీని 25 మందితో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయనున్నట్టు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు బుజ్జి, ఆగొల్లు కృష్ణారావు, మాల్లిపూడి రాజు, కట్టా ఈశ్వర్, ఆకుల గంగాధర్ రావు, దిమ్మిటి రమేష్, నెర్సు నెలరాజు, నెరుసు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ఇజ్రాయేలు ఎన్నికపై హర్షం



ఇజ్రాయేలును అభినందిస్తున్న హరికృష్ణ, చిత్రంలో ఎంపీ సురేష్

ఏలూరు (టూటౌన్): ఎమ్మెల్యే కోటా నుంచి అమలాపురానికి చెందిన బొమ్మి ఇజ్రాయేలు ఎమ్మెల్సీగా ఎన్నికవడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ నాయకులు పాలిమేర హరికృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సచివాలయంలో ఇజ్రాయేలును, ఎంపీ నందిగం సురేష్‌ను కలిసి అభినందనలు తెలియజేసిన విషయాన్ని స్థానిక గన్‌బజార్ సెంటర్లో హరికృష్ణ వెల్లడించారు. ఇజ్రాయేలు తాను కలిసి రాష్ట్రంలో అనేక దళిత సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నట్టు చెప్పారు. దళిత ఉద్యమంలో పదేళ్లపాటు కలిసి పనిచేశామన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ సురేష్, ఎమ్మెల్యేలకు దళిత సామాజిక వర్గాల తరుపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు పాకా ప్రభాకర్ రావు, జిజ్జువరపు ప్రసాద్, కటారి నాగేశ్వరరావు, మందపాటి జోజి, గూడవల్లి శ్రీనివాస్, పాలిమేర దుర్గారావు, చింతాటి వెంకి తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబాకు శత కలశాభిషేకం



మేయర్ దంపతులకు షిర్డీ సాయి చిత్రపటం బహూకరిస్తున్న మందిర కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఆదివారపు పేట షిర్డీ సాయి ప్రేమ మందిర్ చతుర్ధ వార్షికోత్సవాల్లో నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు పాల్గొని బాబాకు శతకలశాభిషేకం నిర్వహించారు. ఉదయం మందిరంలో 4.30 గంటలకు కాకడ హారతి సమర్పించారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవాచన, అఖండ దీపారాధన, గోపూజ, నవగ్రహ మండపారాధన చేశారు. ఉదయం 7 గంటల నుంచి నవీ పుష్కరిణి జలాలలతో, సుగంధ ద్రవ్యాలతో కూడిన 108 కలశాలతో భక్తులు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. మందిరం శిఖరానికి గజ పతాకావిష్కరణ చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్న సమారాధనను మేయర్ దంపతులు ప్రారంభించి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం బాబాకు పల్లకీ సేవ నిర్వహించారు. మందిర కమిటీ ప్రతినిధులు మేయర్ దంపతులకు బాబా చిత్రపటాన్ని బహూకరించి దుశ్శాలువాలతో సత్కరించారు. కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ పాషా, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, మందిర కమిటీ ప్రతినిధి ఇసుకపల్లి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ విడుదల

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ పోస్టర్‌ను స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. కేంద్రం విధానాలతో ప్రజలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారని, లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి రైతులను బిచ్చగాళ్లుగా మారుస్తున్నారని, ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని కుట్ర చేస్తున్నారని వాపోయారు. చలో ఢిల్లీ విజయవంతం కోరుతూ ఈ నెల 26 నుంచి 29 వరకు జిల్లా వ్యాప్తంగా జీపు జాతా నిర్వహిస్తామన్నారు.

వడ్డీ రాయితీతో ఊరట.. జోరుగా పన్నుల చెల్లింపు

- బకాయిదారులకు సుమారు రూ.12 కోట్ల లబ్ధి
- మార్చి 31 వరకు అవకాశం



ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో పన్ను వసూలుపై స్పెషల్ డ్రైవ్‌లో డిప్యూటీ కమిషనర్

ఏలూరు నగరంలో గృహాలు	65717
నగరంలో ఆస్తి పన్ను మొత్తం	రూ.42.73 కోట్లు
పన్నుల పాత బకాయిలు	రూ.18.63 కోట్లు
తాజా ఆస్తి పన్ను	రూ.24.10 కోట్లు
నగరంలో పన్నుల వసూలు ఇలా	
ప్రస్తుత ఆస్తి పన్ను వసూలు శాతం	70.72 శాతం
తాజా ఆస్తి పన్ను వసూలు చేసినవి	రూ.17.04 కోట్లు
తాజా పన్నులో వసూలు చేయాల్సినవి	రూ.7.05 కోట్లు

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థ ఆస్తి పన్ను వసూళ్లలో వేగంగా పెంచింది. ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ ప్రత్యేక దృష్టి సారిస్తూ పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. సెలవురోజుల్లో సైతం ఆస్తి పన్నులు చెల్లించేలా ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. పన్నులు చెల్లించేలా క్షేత్ర స్థాయిలో సచివాలయ సిబ్బందితో కలిసి రెవెన్యూ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలను ప్రోత్సహిస్తున్నారు. డిప్యూటీ కమిషనర్ సీహెచ్ బాపిరాజు, రెవెన్యూ అధికారి అరుణ, సిబ్బంది పన్ను బకాయిల వడ్డీ రాయితీపై అవగాహన కల్పిస్తున్నారు. ఏలూరు వన్‌టౌన్, టూటౌన్ ప్రాంతాల్లో బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు.

భారీగా వడ్డీ రాయితీ

ఏలూరు నగరంలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు, ప్రభుత్వ శాఖల భవనాల పన్నులు, నీటి కుళాయి పన్నులు చెల్లింపులకు ప్రతి ఏటా మార్చి 31వ తేదీ ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు ఆఖరి గడువు ఉంటుంది. గత మూడేళ్లుగా కరోనా మహమ్మారి ప్రజలను ఆర్థిక కష్టాల్లోకి నెట్టేసిన తరుణంలో ఆస్తి పన్ను బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ప్రభుత్వం పన్ను వసూలుపై పెద్దగా ఒత్తిడి చేయకుండా ప్రజలకు వెసులుబాటు కల్పించింది. ఈ నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం ముగింపులోపు పన్నుల చెల్లింపులపై వడ్డీ రాయితీ ప్రకటించటంతో ప్రజలకు ఊరటి నిస్తోంది. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో సుమారుగా రూ.42.73 కోట్లు ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉండగా వడ్డీ రాయితీ కల్పించటంతో ప్రజలపై భారీగా ఆర్థిక భారం లేకుండా చేసింది. ఏలూరు కార్పొరేషన్ పరిధిలోనే వడ్డీ రాయితీ ఏకంగా రూ.12 కోట్లు వరకు ఉండడం విశేషం.

పన్నుల వసూలు ఇలా

ఏలూరు నగరంలో ఆస్తి పన్ను చెల్లింపులు జోరందుకున్నాయి. వడ్డీ రాయితీ కల్పించటంతో పన్నుల చెల్లింపుల్లో వేగం పెరిగింది. కరోనా నేపథ్యంలో గత మూడేళ్లుగా పన్నుల చెల్లింపులు మందగించాయి. ప్రభుత్వం సైతం పన్నుల వసూళ్లపై ఒత్తిడి తేకుండా వెసులుబాటు కల్పించింది.


రూ.12 కోట్ల వడ్డీ రాయితీ



ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది. ప్రజల సమస్యలను, ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వడ్డీ రాయితీ కల్పిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులతో ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు వడ్డీ రాయితీగా సుమారు రూ.12 కోట్ల వరకు లబ్ధి చేకూరుతుంది. బకాయిదారులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో నగర అభివృద్ధికి ప్రజలు సహకరించాలి.

– షేక్ నూర్జహాన్, ఏలూరు నగర మేయర్

స్పెషల్ డ్రైవ్ నిర్వహణ



ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నులను త్వరితగతిన వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. రెవెన్యూ అధికారులు, సిబ్బంది, స్థానిక సచివాలయ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. భారీగా పన్ను బకాయిలు ఉన్న వారికి పన్ను చెల్లింపులపై అవగాహన కల్పిస్తున్నాం. ఆస్తి పన్ను చెల్లింపుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చట్టం మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం. ప్రభుత్వం వడ్డీ రాయితీ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరుతున్నాం.

– సంక్రాంతి వెంకటకృష్ణ, ఏలూరు నగర కమిషనర్

బాస్కెట్‌బాల్ రింగ్స్ ఏర్పాటు



బోర్డుకు ఏర్పాటుచేసిన రింగ్

ఏలూరు రూరల్: ఏలూరు ఇండోర్ స్టేడియం బాస్కెట్‌బాల్ కోర్టు రింగులకు మరమ్మతులు చేపట్టారు. ఆరేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ రింగ్స్ తుప్పు పట్టి విరిగిపోయాయి. దీనిపై స్పందించిన జిల్లా చీఫ్‌కోచ్ శ్రీనివాస్ సీనియర్ క్రీడాకారుల సహకారంతో రెండు బోర్డుల రింగ్స్ తీయించారు. మరింత కాలం మన్నికయ్యేలా రింగ్స్ చుట్టూ సపోర్టు రాడ్స్ పెట్టి వెల్డింగ్ చేయించారు. బోర్డులకు బిగించారు. దీంతో సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బాస్కెట్‌బాల్ కోర్టు చుట్టూ ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

శెట్టిబలిజలకు గుర్తింపు తెచ్చిన దొమ్మేటి

ఏలూరు (టూటౌన్): శెట్టిబలిజలకు దొమ్మేటి వెంకటరెడ్డి గుర్తింపు తీసుకొచ్చారని సంఘం నాయకులు పేర్కొన్నారు. సంఘం వ్యవస్థాపకుడు దొమ్మేటి వెంకటరెడ్డి 170వ జయంతి కార్యక్రమం స్థానిక శెట్టిబలిజ సంక్షేమ సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ 1920లో శెట్టిబలిజ సంఘం స్థాపించడమే కాకుండా జాతికి ఒక గుర్తింపును తీసుకొచ్చిన మహనీయుడు వెంకటరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనమిచ్చే గొప్ప నివాళి అన్నారు. సంఘం అధ్యక్షుడు వసాది శ్రీనివాసరావు, దంపనబోయిన సుబ్రహ్మణ్యం, జి.నాగదుర్గారావు, పంపన కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

మానవాళి సంక్షేమమే లక్ష్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రపంచంలో శాంతి, సౌభ్రాతృత్వ నిర్మాణానికి విశ్వమానవాళి ముందుకు కదులుదామని వాటికన్ రాయబారి లియోపోర్డ్ జిరెల్లి పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా జిరెల్లి గురువారం ఉదయం స్థానిక బిషప్ హౌస్‌లోని ఆర్‌సీఎం కథిడ్రల్‌లో ప్రత్యేక దివ్య బలిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిరెల్లి మాట్లాడుతూ ప్రపంచ మానవాళి సంక్షేమంతో పాటు సేవ, ఆరోగ్యం, విద్య, ఉద్యోగం తదితర రంగాల్లో ప్రజలను మమేకం చేసి పేదలకు సహాయ సహకారాలు అందించే దిశగా చైతన్య పరచడమే వాటికన్ సిటీ లక్ష్యమన్నారు. ఏసు ప్రభువు సూచించిన మార్గంలో నడుచుకునేలా ప్రజలకు దిశానిర్దేశం చేయడంతో పాటు అన్నిమతాల సారం ఒక్కటేననే సత్యాన్ని బోధించడం ద్వారా ప్రపంచంలో శాంతి స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. తొలుత ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన్ని నగరానికి చెందిన పలు రాజకీయ పార్టీల నాయకులు, ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధులు, పలు మతాల నాయకులు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు దంపతులు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు గారపాటి చౌదరి, టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటి, జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, జైన సంఘం ప్రతినిధి విజయకుమార్ జైన్, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఏలూరు నగర కేంద్ర నిర్వాహకురాలు బీకే లావణ్య పారిశ్రామికవేత్తలు అంబికా కృష్ణ, వేణుగోపాల్ లునాని తదితరులు ఉన్నారు. వీరిని అందరూ బాగున్నారా అంటూ జిరెల్లి తెలుగులో కుశలప్రశ్న అడగడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. జిరెల్లికి ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు, ఫాదర్లు పి.బాల, జి.మోజెస్, మైఖేల్ ఇంజమాల, రాజు, టి.ఇమ్మానియేల్, బాబు జార్జ్, తోట అంతోని ఘన స్వాగతం పలికారు.



బిషప్‌హౌస్‌లో మాట్లాడుతున్న వాటికన్ రాయబారి జిరెల్లి



జిరెల్లికి జ్ఞాపిక అందిస్తున్న ఆంటినోరీ సొసైటీ సీఈఓ ఎడ్వర్డ్

శ్రీకాంత్‌కు అబ్దుల్ కలాం అవార్డు



శ్రీకాంత్‌ను అవార్డుతో సన్మానిస్తున్న ఆర్గనైజేషన్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : విద్యారంగంలో విశేష కృషి చేస్తోన్న స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మార్గాని నాగ శ్రీకాంత్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు లభించింది. రాజమహేంద్రవరానికి చెందిన ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశేష సేవలు చేసిన వారిని గుర్తించి ఏపీజే అబ్దుల్ కలాం అవార్డులను ప్రదానం చేసింది. శ్రీకాంత్ ఏలూరు పరిసర ప్రాంతాల్లో విద్యారంగంలో గత 25 సంవత్సరాలుగా విశేష సేవలు అందిస్తున్నారు. కోవిడ్ సమయంలో ఉపాధి కోల్పోయిన 252 మంది ఉపాధ్యాయులకు రెండు నెలల పాటు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. కోవిడ్ బారిన పడిన 32 మందికి సకాలంలో వైద్య సహాయం అందేలా కృషి చేశారు. అనేక మందికి మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో శ్రీకాంత్‌కు రాజమండ్రిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఎం. షర్మిలా రెడ్డి అవార్డును ప్రదానం చేశారు. శ్రీకాంత్‌ను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, కార్యదర్శి నల్లమిల్లి సుగుణా రెడ్డి, ఏలూరు ఆదిత్య డిగ్రీ కళాశాల సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

పంట చేలకు నష్టం లేదు

ఏలూరు రూరల్: అకాల వర్షాల వల్ల ఏలూరు మండలంలో పంటచేలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని మండల వ్యవసాయ అధికారిణి జీవనసంధ్య తెలిపారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలపై ఆమె సాక్షితో మాట్లాడారు. చొదిమెళ్ల గ్రామంలో అధిక శాతం రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారని గుర్తు చేశారు. వర్షం పడే సమయంలో ఈదురు గాలులు రానుందున ఎక్కువగా మొక్కజొన్న కంకులు నేలకు వాలలేదని చెప్పారు. మల్కాపురంలో వరి సాగు చేస్తున్న రైతులకు వర్షాలు కొంత మేలు చేశాయన్నారు. వర్షం నీరు ఎగువ ప్రాంతంలో పంటచేలకు మరికొంత తడి ఇచ్చిందని తెలిపారు. జాలిపూడి, మాదేపల్లి, కాట్లంపూడి, చాటపర్రు ప్రాంతాల్లో సాగు చేసిన మినుములు, పెసల పంటను రైతులు కోసేశారని చెప్పారు. కల్లాల్లో ఉన్న పంట తడవకుండా బరకాలు కప్పుకున్నారని వివరించారు.

భగత్‌సింగ్ వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్) : భగత్‌సింగ్ వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి వక్తలు పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ, ఎన్‌వైఎస్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ మోహన్ అధ్యక్షతన భగత్‌సింగ్ 92వ వర్ధంతి సభ నిర్వహించారు. అనంతరం ప్రదర్శన, సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన చదువులు ప్రజలందరికీ అందుబాటులో లేని కారణంగా పేదలు విద్యకు దూరం అవుతున్నారన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్, ఎన్‌వైఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే భాషా మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ నిరుద్యోగ సైన్యాన్ని పెంచి పోషిస్తున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వారి ఆశయాలను నెరవేర్చుదాం

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాలను నెరవేర్చాలని వక్తలు పిలుపునిచ్చారు. వీరి వర్ధంతి, స్వాతంత్ర్య సమరయోధులు హరికిషన్ సింగ్ సూర్జిత్ జయంతి కార్యక్రమాలను గురువారం స్థానిక పవరుపేటలోని ఉద్దరాజు భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి హరికిషన్ సింగ్ సూర్జిత్ ఫొటోకు, భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటానికి గుడిపాటి నరసింహారావు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కె.శ్రీనివాస్, బి.జగన్నాథరావు, కోటేశ్వర రావు, జె.గోపి, సత్యం, త్రినాథ్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : భగత్ సింగ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని పేర్కొన్నారు. పీడీఎస్‌యూ ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 92వ వర్ధంతి కార్యక్రమం స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని ఐటీఐ (డీఎల్‌టీసీ) కళాశాలలో గురువారం నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి నాని పూలమాల వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు ఎంసీహెచ్ యుగంధర్, ఎస్ సాయి, ఎస్‌కే ఆబీబు, కళాశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రంజాన్ దీక్షలకు మసీదుల ముస్తాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : రంజాన్ మాసం ఉపవాస దీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రంజాన్ శుక్రవారం ప్రారంభం కావడం ఈ ఏడాది ప్రత్యేకతగా ముస్లింలు భావిస్తున్నారు. నెలరోజుల పటు కఠోర ఉపవాస దీక్షలు చేసి తామ సంపాదనలో కొంత మొత్తాన్ని దానాలకు కేటాయించడం రంజాన్ మాసం ప్రత్యేకత. ఇప్పటికే పలువురు ముస్లిం ప్రముఖులతో పాటు, హిందువులు సైతం ముస్లింలకు రంజాన్ తోఫాలు పంపిణీ చేశారు. నిత్యం సాయంత్రం ఉపవాసదీక్ష ముగిసిన అనంతరం ఇఫ్తార్ సమయంలో ప్రత్యేక జావ, ఇతర బలవర్థక ఆహార పదార్థాలను ఆయా మసీదుల్లో ముస్లింలకు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. నగరంలో జామియా, చౌక్, ఖురేషీ, నాథూమియా, మదీనా, అక్కిలేట్, ఎంఎం కాలనీ, మాదేపల్లి, గేట్, పెన్షన్ మహల్లా, జమీరాత్, పెన్షన్‌లైన్, నెహార్, పురానీ, నయీ, మర్కజ్, బీడీ కాలనీ, ఇస్లాం పేట, ఫాతిమా, జిల్లా, శనివారపు పేట, దొండపాడు, మహ్మదీయ, వైఎస్‌ఆర్ కాలనీ, తబ్లిక్ జమాత్, నూర్ మసీదుల్లో ఇప్పటికే ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు కానుకులు అందిస్తున్న కార్పొరేటర్ రాము

ఏలూరు రూరల్: ఆరోగ్యవంతమైన శిశువుల జననం కోసం గర్భిణులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందని 15 డివిజన్ కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ గురువారం స్థానిక అంగన్‌వాడీ సెంటర్లో చిరుధాన్యాల ప్రాముఖ్యత, గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాము మాట్లాడుతూ గర్భిణులు తీసుకునే ఆహారంలో పోషక విలువు ఉండేలా చూసుకోవాలన్నారు. సీడీపీఓ ఎ.పద్మావతి మాట్లాడుతూ కమ్యునిటీ ఆధారిత కార్యక్రమంలో భాగంగా పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సూపర్‌వైజర్ సీహెచ్ నాగలక్ష్మి, ప్రతిమానాయక్ అధ్వర్యంలో గర్భిణులకు సీమంతం చేశారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ఏలూరు (టూటౌన్): చిరుధాన్యాలు తినడం, వ్యాయామం చేయటం వలన అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్య వంతంగా ఉంటారని కరుణోదయ స్కూల్ ప్రిన్సిపాల్ డోమ్నిక్ అన్నారు. స్థానిక కబాడీగూడెం 2 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. మానవత కార్యదర్శి మేతర అజయ్ బాబు మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశా వర్కర్, స్థానికులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ పరిధిలో రెండు చోట్ల పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు చేశారు. ఏలూరు తంగెళ్లమూడి శివగోపాలపురంలో పేకాడుతోన్న ఆరుగుర్ని అరెస్టు చేసి, రూ.10,100 స్వాధీనం చేసుకున్నారు. తంగెళ్లమూడి ప్రాంతంలో పేకాడుతున్న ఐదుగుర్ని అరెస్టు చేసి రూ.6780 స్వాధీనం చేసుకున్నారు.

ముస్లింల సంక్షేమానికి సీఎం జగన్ కృషి



రాజా అహ్మద్‌ను సన్మానిస్తున్న ముస్లిం ఐక్యవేదిక ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ముస్లిం మైనార్టీ వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ రాజా అహ్మద్ పేర్కొన్నారు. పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా రాజా అహ్మద్‌ను ఏపీ రాష్ట్ర ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక అంజుమన్ హాలులో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజా అహ్మద్ మాట్లాడుతూ అడగకుండానే ముస్లింల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ముస్లింలు రాజకీయ ప్రాధాన్యత కల్పించి నామినేటెడ్ పదవులను కట్టబెడుతున్నారన్నారు. ముస్లిం ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎండీ మసీవుల్లా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ముస్లింలందరూ ఏకతాటిపైకి వచ్చేలా తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా షేక్ రాజా అహ్మద్‌ను ఏపీ రాష్ట్ర ముస్లిం ఐక్య వేదిక జిల్లా గౌరవాధ్యక్షునిగా నియమించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు షేక్ మున్ని, షేక్ సిలార్, అంజుమన్ సంస్థ అధ్యక్షుడు ఎండీ సులేమాన్, కార్యదర్శి ఎస్కే అమీర్‌జానీ, ప్రచార కార్యదర్శి ఎండీ ఎగ్బాల్, కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ పాషా తదితరులు పాల్గొన్నారు.